

నేడే ఎస్సారెస్పీ ఆయకట్టుకు నీటి విడుదల

మెండోర, ఆగస్టు 6: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువలకు బుధవారం నీటి విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. కాకతీయ కాలువ, సరస్వతి కాలువ, లక్ష్మీకాలువకు నీటి విడుదల జరగనుందని, ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో పంటలకు సాగుకు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కాకతీయ, లక్ష్మీ కాలువలకు నీటి విడుదల చేయనున్నారు. ప్రాజెక్టులోకి 12647 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం 1080.4 అడుగులు (46.057టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని అధికారులు తెలిపారు.



ఘనంగా జయశంకర్ జయంతి

జిల్లా వ్యాప్తంగా తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహం, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నగరంలోని కంఠేశ్వర్ చౌరస్తాలోగల ఆయన విగ్రహానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుతోపాటు ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ అందించిన సేవలను కొనియాడారు.



తెల్లకాగితాలపై క్రయవిక్రయాలు జరిపిన సాగు భూములకు చట్టబద్ధత కల్పించేందుకు మూడేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల నుంచి సాదాబైనామా దరఖాస్తులను స్వీకరించింది. దీంతో అర్హులైన వారు మీ సేవ కేంద్రాల ద్వారా తహసీల్దార్లకు దరఖాస్తులు అందజేశారు. అయితే క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో అవి కార్యరూపం దాల్చలేదు. 2014 జూన్ 2లోపు కాగితంపై భూములు కొనుగోలు చేసిన వారికి పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేయాలని నూతన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించినా.. అధికారులు మాత్రం సాదాబైనామాల దరఖాస్తులను పరిష్కరించడంలో శ్రద్ధ చూపడం లేదు. దీంతో నిత్యం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ భూ పట్టాలు ఎప్పుడు ఇస్తారంటూ రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

సాదా బైనామాలకు మోక్షమెప్పుడో?

- ఏళ్లు గడుస్తున్నా చేతికందని పట్టాలు
- ఇప్పటికే రెండుసార్లు అర్జీలు స్వీకరించిన అధికారులు
- ఇంకా లభించని పరిష్కారం
- ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న రైతులు
- జిల్లాలో 30వేల దరఖాస్తులు

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 6: తెల్ల కాగితాలపై కొనుగోలు చేసిన భూములకు సంబంధించిన అనేక దరఖాస్తులు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో భూములు కొనుగోలు చేసిన రైతులు అవి రికార్డుల్లోకి ఎక్కకపోవడంతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. కాగితాలపై ఒప్పందాలతో కొనుగోలు చేసిన భూములకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో చట్టబద్ధత కల్పించేందుకు అవకాశం కల్పించినప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యంతో అవి కార్యరూపం దాల్చలేదు. 2014 జూన్ 2లోపు కాగితంపై భూములు కొనుగోలు చేసిన వారికి పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా.. అధికారులు మాత్రం సాదా బైనామాల దరఖాస్తులను పరిష్కరించడంలో శ్రద్ధ చూపడం లేదు. దీంతో అనేక ఏళ్లుగా భూములు కొనుగోలు చేసిన అవి రికార్డులోకి ఎక్కకపోవడంతో వేలాది మంది రైతులు ప్రభుత్వం నుంచి అందే సహాయాన్ని పొందలేక పోతున్నారు. దశాబ్దాలుగా భూములు సాగు చేసుకుంటున్న రైతులకు మాత్రం హక్కులు రాక ఇబ్బందులు పడుతున్నారు. భూ పట్టాలు చేతిక రాక ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో 15వేల దరఖాస్తులు తిరస్కరణ

జిల్లా వ్యాప్తంగా సాదాబైనాల కింద 45వేలకు పైగా దరఖాస్తులు వచ్చినప్పటికీ వివిధ కారణాలతో 15వేల దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. ప్రస్తుతం 30వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. బాండ్‌పేపర్ల ద్వారా, వైట్ పేపర్ల ద్వారా భూముల క్రయ విక్రయాలు జరిపిన రైతులంతా సాదాబైనామాల కింద దరఖాస్తులు చేసుకున్నారు. ఇంక అనేక మంది రైతులు బాండ్‌పేపర్లే అసలు భూమి పేపర్లని నమ్మి ఇంక చాల మంది దరఖాస్తులు చేసుకోలేదు. ధరణి వల్ల ప్రభుత్వం కొత్త పాస్‌బుక్కులు ఇవ్వడంతో వాటిల్లో తాము కొనుగోలు చేసిన సర్వే నంబర్ల గల భూములు లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రైతులు తిరుగుతున్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి పదుల సంఖ్యలో భూములకు సంబంధించిన దరఖాస్తులే వస్తున్నాయి. జిల్లాలో అనేక భూములు కొనుగోలు చేసినప్పటికీ అవి కొనుగోలుదారుల పేర్లుకాకుండా అమ్మిన వారి పేర్లే ఉండడంతో క్రయవిక్రయాలు జరిపిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

గతంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేతి రాత కాగితాలకు చట్టబద్ధత ఇవ్వగా, తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సాదాబైనామాల చట్టబద్ధతకు రెండుసార్లు దరఖాస్తులు స్వీకరించారు. పాత రెవెన్యూ చట్టం రద్దు తర్వాత దాని ఆధారంగా చేపట్టే సాదాబైనామాలకు క్రమబద్ధీకరణ నిలిపి వేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంతో సాదాబైనామాల చట్టబద్ధతకు బ్రేక్ పడింది. కొత్తగా ప్రభుత్వం ఏర్పడడంతో రైతులు సాదాబైనామాల సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశతో ఉన్నారు.

నిబంధనలను సడలించినా.. పరిష్కారం లేదు

సాదాబైనామాలను పరిష్కరించాలని తొలుత ప్రభుత్వ రెవెన్యూ డివిజనల్ అధికారులకు అధికారం ఇచ్చినప్పటికీ ప్రక్రియ నెమ్మదిగా జరగడంతో వారిని బాధ్యతల నుంచి తప్పించింది. వేల దరఖాస్తులను ఆర్డీవోలు పరిశీలించడం అసాధ్యమని భావించిన ప్రభుత్వం తహసీల్దార్లకే పూర్తి స్థాయి బాధ్యతలను అప్పగించింది. రైతులు ఆన్‌లైన్‌లో ఫారం-10 ద్వారా చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి సాదాబైనామ విక్రయాన్ని క్రమబద్ధీకరించేందుకు తహసీల్దార్లు 13-బీ ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఆ తర్వాత 1-బీలో నమోదు చేసి రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకం అందించాల్సి ఉంటుంది. విక్రయదారులు నోటీసులు జారీ చేయడం, వాంగ్మూలం నమోదులో వీరి పాత్ర కీలకంగా ఉంటుంది. ఇందుకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తూ తమ వేలి ముద్రలు వేసి రైతులకు హక్కు పత్రాన్ని తహసీల్దార్లు జారీ చేయాల్సి ఉంటుంది. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో సరిపడా సిబ్బంది లేక సాదాబైనామాలకు పరిష్కారం లభించడం లేదు.

వేలాది మంది రైతులకు లబ్ధి

సాదాబైనామాలకు పరిష్కారం లభిస్తే జిల్లాలో వేలాది మంది రైతులకు ప్రయోజనం కలుగనుంది. వివిధ పంటలను సాగు చేస్తున్న రైతులు రైతుభరోసా, రైతుబీమా వంటి ప్రభుత్వ సహాయం అందనుంది. భూములపై హక్కు పత్రాలు ఉంటేనే, సర్వేనంబర్లు పట్టా బుక్కుల్లో నమోదు అయితేనే బ్యాంకులు రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుంది. రుణమాఫీ సైతం సక్రమంగా పొందలేని అనేక మంది రైతులు జిల్లాలో ఉన్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం అధికారులు సాదాబైనామాలకు పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 6: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా 2024-25 విద్యాసంవత్సరానికి గాను పదవ తరగతి, ఇంటర్‌లలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎక్స్ సర్వీస్‌మెంట్, ఫిజికల్ హ్యాండిక్యాపడ్, అన్ని వర్గాల మహిళలకు ప్రవేశ రుసుములో ప్రభుత్వం నుంచి ఫీజు రాయితీ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లాలోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లలో ప్రవేశం పొందే అవకాశం ఉందని అడ్మిషన్లు, ఇతర వివరాల కోసం ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ తూలా రవీందర్ 8008403518, 9849234696 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఆగస్టు 8 నుంచి సెప్టెంబరు 10 వరకు పదో తరగతి కోసం 1550 రూపాయలు, ఇంటర్మీడియెట్ కోసం 1800 రూపాయలు చెల్లించవచ్చని సెప్టెంబర్ 11 నుంచి అక్టోబరు 3 వరకు పదో తరగతికి రూ.100, ఇంటర్‌కు రూ.200లు అదనపు రుసుముతో అడ్మిషన్లు పొందవచ్చని జిల్లాలోని అర్హతకలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



జిల్లాలో పెరిగిన పంటల సాగు విస్తీర్ణం

- జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు
- వరిసాగుకే మొగ్గుచూపుతున్న రైతులు
- సన్నాల సాగుకు పెరిగిన డిమాండ్
- ఈ నెలాఖరులోపు మరింత పెరగనున్న పంటల సాగు విస్తీర్ణం

నిజామాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం భారీగా పెరుగుతోంది. జిల్లా అంతటా గత నెల నుంచి వర్షాలు పడుతుండటంతో ఎక్కువ మొత్తంలో రైతులు సాగు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల పరిధిలో పంటలను ఎక్కువ మొత్తంలో వేస్తున్నారు. ఆరుతడి పంటలతో పాటు వరిసాగు ఎక్కువగా కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడి భూగర్భ జలాలు పెరగడంతో ఇప్పటి వరకు 90శాతానికి పైగా పంటలు సాగయ్యాయి. వ్యవసాయ అధికారులు నిర్ణయించిన లక్ష్యం ప్రకారం ఈనెల రెండో వారంలోపు సాగు విస్తీర్ణం దాటుతుందని అంచనా వేస్తున్నారు. జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడకున్నా సగటు వర్షపాతం కంటే ఎక్కువగా పడటం వల్ల రైతులు వరిసాగుకే మొగ్గు చూపారు. జిల్లా అం తటా ఇతర ఆరుతడి పంటలకు బదులు ఈ పంటనే ఎక్కువగా సాగు చేస్తున్నారు. కాగా, బుధవారం నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల చేయనుండటంతో మరింత సాగు విస్తీర్ణం పెరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

జూన్‌లోనే ఆరుతడి పంటల సాగు

జిల్లాలో జూన్‌లోనే ఆరుతడి పంటలు మొక్కజొన్న, సోయా, పసుపు, కంది, పెసరతో పాటు ఇతర పంటలు వేసిన రైతులు ప్రస్తుతం వరిసాగు కొనసాగిస్తున్నారు. వానాకాలంలో 5లక్షల 52వేల 128 ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు జిల్లాలో 4లక్షల 80వేల 536 ఎకరాల్లో పంటలను వేశారు. నిర్ణయించిన వానాకాలం వ్యవసాయ ప్రణాళిక ప్రకారం 90శాతం మేర పంటలు సాగయ్యాయి. జూన్‌లో ఆరుతడి పంటలైన మొక్కజొన్న, సోయా, పసుపు సాగును రైతులు వేశారు. బోధన్ డివిజన్ పరిధిలో కొంత మేర వరినాట్లను వేశారు. జిల్లాలో ఈ సంవత్సరం మొక్కజొన్న 43వేల 10 ఎకరాల్లో సాగు చేశారు. గత సంవత్సరం కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఈ పంటను వేశారు. జిల్లాలో సోయాబీన్ సాగు మాత్రం గణనీయంగా తగ్గింది. జిల్లాలోని బోధన్, ఆర్మూర్ డివిజన్ పరిధిలో 34వేల 744 ఎకరాల్లో ఈ పంటను సాగు చేశారు. జిల్లాలో పసుపు సాగు కూడా ఎక్కువగా పెరగలేదు. గత సంవత్సరం కంటే 5వేల ఎకరాలు మాత్రమే ఎక్కువగా రైతులు వేశారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో 24వేల 662 ఎకరాల్లో ఈ పంటను సాగు చేశారు. వీటితో పాటు మినుములు, పెసర, కందితో పాటు కూరగాయల సాగును రైతులు చేపట్టారు.

75 శాతానికి పైగా వరి సాగు

శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులతో పాటు చెరువులు, కుంటల్లో నీళ్లు ఉండటం వల్ల వర్షాలకు అనుగుణంగా వరిసాగునే చేస్తున్నారు. ఆరుతడి పంటలకు అవగాహన కల్పించిన రైతులు మాత్రం ఎక్కువ మొత్తంలో వరిసాగే చేస్తున్నారు. వ్యవసాయ శాఖ నిర్ణయించిన ప్రణాళిక ప్రకారం 75 శాతానికి పైగా రైతులు వరి వేస్తున్నారు. శ్రీరాంసాగర్, నిజాంసాగర్ కాలువల కిందనే కాకుండా గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాల కింద వరినాట్లు వేశారు. జిల్లాలో ఈ వానాకాలంలో వరిసాగు 4లక్షల 30వేల 550 ఎకరాల్లో సాగు అవుతుందని అంచనా వేయగా ఇప్పటి వరకు 3లక్షల 75వేల 132 ఎకరాల్లో సాగు అయింది. జూన్ నెలలో బోధన్ డివిజన్ పరిధిలో వరినాట్లు కొనసాగగా నిజాంసాగర్ నీటి విడుదలతో ఎక్కువ మొత్తంలో ఆ ప్రాంతంలో వరినాట్లను వేశారు. జూలై నెలలో వర్షాలు పడుతుండటం ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు పడుతుండటంతో అన్ని మండలాల పరిధిలో వరినాట్లను జిల్లాలో నిర్ణయించిన లక్ష్యం ప్రకారం ఈ వానాకాలంలో ఇప్పటి వరకు 91 శాతానికి పైగా వరి సాగు చేశారు. వరినాట్లు వేసేందుకు ఈనెల 15 వరకు అవకాశం ఉండటంతో ప్రస్తుతం పడుతున్న వర్షాలతో మిగతా రైతులు కూడా ఈనాట్లను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించడం వల్ల ఈ సంవత్సరం వానాకాలంలో సన్నరకాల వరిసాగు ను ఎక్కువగా రైతులు చేపడుతున్నారు. వరిసాగులో 65 శాతానికి పైగా సన్నరకాలనే సాగు చేస్తున్నారు. సన్నరకం ధాన్యానికి బహిరంగ మార్కెట్లో డిమాండ్ ఉండటం కర్నాటక, ఏపీ రాష్ట్రాల నుంచి వ్యాపారులు జిల్లాకు వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తుండటంతో ఎక్కువ మంది రైతులు ఈ పంటను వేస్తున్నారు. అన్ని ప్రాథమిక సహకార సంఘాలతో పాటు మార్క్‌ఫెడ్ కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల వద్ద ఎరువుల నిల్వలను ఉంచి రైతులకు సరఫరా చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పంటల విస్తీర్ణం భాగా పెరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్ తెలిపారు. జిల్లాలో ఈనెలాఖరులోపే మరింత సాగు పెరుగుతుందన్నారు. రైతులు ఎక్కువగా వరిసాగుకే మొగ్గు చూపుతున్నారని ఆయన తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామని ఆయన తెలిపారు.



రూ. 43 కోట్లతో తాగునీటి విస్తరణ పనులు

- ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి

ఆర్మూర్ రూరల్, ఆగస్టు 6: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో తాగునీటి విస్తరణ పనుల కోసం రూ.43 కోట్లను వెచ్చించనున్నామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి ఆర్మూర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి తాగునీటి సరఫరా తీరుతెన్నులు, ట్యాంకుల నిర్మాణానికి స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిద్దులగుట్టపై గల పంప్ హౌజ్, దోబి ఘాట్, హౌజింగ్ బోర్డులోని వాటర్ ట్యాంకులు, బాల్కొండ గుట్టపై ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ఆర్మూర్ పట్టణంలో పెరిగిన జనాభా అవసరాల అనుగుణంగా తాగునీటి వనరులను పెంపొందించడానికి అమృత్ పథకంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.43 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో పైప్‌లైన్ ఏర్పాటు, కొత్త ట్యాంకుల నిర్మాణం, ఇతర పనులు చేపడతారన్నారు. మరో 20ఏళ్ల వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. లే అవుట్, వెంచర్‌లలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం పదిశాతం స్థలాలను వదిలి పెట్టాలని, వాటిని అధికారులు కాపాడాలని సూచించారు. అసైన్డ్ భూములు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి హెచ్చరించారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వీరి వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ గజానన్, మున్సిపల్ కమిషనర్ రాజు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో ట్యాంకు నిర్మాణానికి స్థలం పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, కలెక్టర్ తదితరులు

శిథిలావస్థకు చేరిన నిర్మాణాలను తొలగించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 6: ప్రభుత్వ విద్యాసంస్థల్లో శిథిలావస్థకు చేరిన భవనాలు, వాటర్ ట్యాంకులను తొలగించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపడుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పరిశీలించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. తరగతి గదులు, వంట గది, స్టోర్‌రూంలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్‌ట్యాంక్, పాత మరుగు దొడ్లను వెంటనే తొలగించాలని అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. విద్యార్థులు తిరిగే ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలు ఉంటే ప్రమాదాలు సంభవించే అస్కారం ఉంటుందన్నారు. కాలం చెల్లిన నిర్మాణాలను తొలగించేందుకు పంచాయతీరాజ్‌శాఖకు ప్రతిపాదనలు పంపామని, అధికారులకు వివరించామని ఆయన తెలిపారు. పాఠశాలలో చేపట్టిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, పూర్తయిన పనులకు సంబంధించి ఎంబీ రికార్డు చేసి నివేదికలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, ప్రత్యేక అధికారి శ్రీనివాస్, పంచాయతీరాజ్ డీఈ కిషన్‌నాయక్, ఎంపీడీవో సాయిరాం, తహసీల్దార్ నరేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్



విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

డిచ్‌పల్లి,ఆగస్టు 6: తెలంగాణ యూనివర్సిటీ బిజినెస్‌మెనేజ్‌మెంట్ విభాగంలో మంగళవారం ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా మూవీ సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొ.అంజనేయులు మాట్లాడుతూ.. ఎంబీఏ విద్యార్థులు నైపుణ్యాలు మరింత పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు డా.కైసర్,అపర్ణ,వాణి, ఈవెంట్ మేనేజర్‌లు పాల్గొన్నారు.





ఆటోను తప్పించబోయి బోల్తా పడిన లారీ

● త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

కమ్మర్‌పల్లి, ఆగస్టు 6: కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో మంగళవారం ఉదయం ట్రాలీ ఆటోను తప్పించే ప్రయత్నంలో మిర్చిలోడ్‌తో వెళ్తున్న ఐచర్‌వాహనం బోల్తాపడింది. అదుపుతప్పిన ఐచర్ ఒక దుకాణం షెడ్డును ఢీకొట్టి బోల్తాపడింది. అయితే ఆసమయంలో దుకాణాలు తెరవకపోవడం, అక్కడ జనం ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. మహారాష్ట్ర నుంచి కరీంనగర్‌వైప మిర్చీలోడ్‌తో వెళ్తున్న ఐచర్ వాహనం ఉప్లూర్ టర్నింగ్, భరతమాత విగ్రహంవద్ద యూటర్న్ తీసుకుంటున్న తాగునీటి సరఫరా ఆటోట్రాలీని తప్పించబోయి బోల్తాపడింది. ఐచర్ డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఐచర్ డ్రైవర్‌ను చికిత్సనిమిత్తం 108అంబులెన్స్‌లో మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే టిఫిన్‌సెంటర్లు, టీస్టాళ్లవద్ద రోడ్లపైనే వాహనాలు నిలిపి ఉంచడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని స్థానిక పోలీసులు నియంత్రించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదానికి గురైన రెండు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు6: పట్టణంలోని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం కేరళ రాష్ట్రంలో వాయినాడ్ జిల్లాలో వరద బాధితుల కోసం విరాళాల సేకరణ చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరదలు రావడంతో తీవ్రంగా నష్టం వాటిల్లిందనివారు తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య, రవి, ఓంకార్ పోశెట్టి, అమీర్, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్‌ఎంకు వినతి

రెంజల్,ఆగస్టు6: మండలంలోని బాగేపల్లి గ్రామానికి ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ రిజినల్ మేనేజర్‌కు తాజా, మాజీ సర్పంచ్ సాయిలు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలోని విద్యార్థులకు, మహిళలకు రవాణా రాకపోకలు ఇబ్బందిగా ఉండడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక నడుచుకుంటూ వెళ్లడంతో ఇబ్బంది పడుతున్నారని విద్యార్థుల సౌకర్యార్థం బస్సును నడిపించాలని ఆర్‌ఎంకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఆటో సాయిలు, గ్రామస్థులు గోపాల్, సాయగౌడ్, తదితరులున్నారు.

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ఏర్గట్ల, ఆగస్టు 6: బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మంగళ వారం మండలంలోని పలు బాధిత కుటుంబాలను పమరామర్శించారు. అందులో భాగంగా తాళ్లరాంపూర్‌లో రాంపెల్లి లక్ష్మీపతి, ఏర్గట్లలో సొసైటీ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య, జక్కుల భూ మన్న, తునికి పెద్ద గంగారాం కుటుంబాలను పరామర్శించి, శంకర్ గౌడ్ కుటుంబానికి 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో భారస మండలాధ్యక్షుడు ఎను గందుల రాజాపూర్ణానందం, మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, నాగులపల్లి అంజిరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ సింగసారం గంగారాం, కొలిప్యాక శ్రీనివాస్, బద్దం ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి సన్మానం

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు6: ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై ప్రస్తావించిన ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని బీజేపీనాయకులు పట్టుశాలువతో ఘనంగా సన్మానించారు. గల్ఫ్ కార్మికుల కష్టాలను, విద్యార్థుల వసతిగృహాల పై, నిరుపేదల పక్కా ఇళ్లు, లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా స్వచ్ఛమైన పాలన కొనసాగించాలని అసెంబ్లీలో ప్రస్తావించడాన్ని హర్షిస్తూ ఎమ్మెల్యేను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతి నిధి కలిగోట గంగాధర్, జెస్సు అనిల్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, నాయకులు ఆకుల రాజు, పొల్కం వేణు, జక్కం పోశెట్టి, యుగేంధర్, ప్రకాష్, లింగన్న, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు

ఎడపల్లిలో విద్యుత్ నియంత్రిక ధ్వంసం

● నెల వ్యవధిలో పదుల సంఖ్యలో విద్యుత్ నియంత్రికల ధ్వంసం

ఎడపల్లి, ఆగస్టు 6: ఎడపల్లి మండలంలోని ఇబ్రహీంపూర్ రెవెన్యూ శివారులో ఎడపల్లి నుంచి ఎరాజ్‌పల్లి వెళ్లే దారి పక్కన శిరిశెట్టి సంతోష్ పంట పొలంలో ఉన్న ఎస్‌ఎస్ 167 నంబరు గల విద్యుత్ నియంత్రికను సోమవారం రాత్రి దుండగులు ధ్వంసం చేసి అందులో ఉన్న రాగి తీగను దొంగిలించారు. మంగళవారం ఉదయం రైతు సంతోష్ తన పొలంకు వెల్లగా విద్యుత్ నియంత్రిక ధ్వంసం అయి ఉండడం చూసి ఆయన పోలీసులకు సమాచారం అందించారు. నెల వ్యవధిలో మండలంలోని ఎడపల్లి , ఇబ్రహీంపూర్, కుర్నాపల్లి, ఠానాకలాన్ శివారులలో దాదాపు 10కి పైగా విద్యుత్ నియంత్రికలను దుండగులు ధ్వంసం చేశారని, రోడ్డు ప్రక్కన ఉన్న నియంత్రికలనే వారు టార్గెట్ చేసి ధ్వంసం చేస్తూ అందులోని రాగి వైరును ఎత్తుకెలుతున్నారని, విద్యుత్ నియంత్రికలు ధ్వంసం కాకుండా పోలీసులు నిఘా పెంచాలని రైతులు కోరుతున్నారు.

120 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

మోర్తాడ్, ఆగస్టు6: మండల కేంద్రంలో టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లయ్ ఆధ్వర్యంలో 120క్వింటాళ్ల 50కిలోల బియ్యాన్ని పట్టుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ ఎదుట ఉన్నరేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని దాడులు చేసి పట్టుకున్నారు. పక్క సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. బియ్యం స్వాధీనం చేసుకొని షెడ్డును సీజ్ చేశారు. ఈ దాడుల్లో ఓఎస్‌డీ శ్రీధర్, డిప్యూటీ తహ సీల్దార్ వినోద్, మహేష్, అధికారుల బృందం పాల్గొన్నారు.






















జిల్లా అంతటా ఘనంగా జయశంకర్ జయంతి

ముప్కాల్, ఆగస్టు6: తెలంగాణ కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ లైఫ్‌టైం ఉద్యమకారుడని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాల్కొండ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో జయశంకర్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యమంలో కొంత మంది పార్ట్‌టైం, కొంత మంది ఫుల్‌టైం ఉద్యమం చేశారని, ఆచార్య జయశంకర్ తన లైఫ్‌టైం తెలంగాణ కోసమే పని చేశారని కొనియాడారు. జయశంకర్ చూపిన బాటలోనే కేసీఆర్ రాష్ట్రాన్ని పాలించారని, జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా పదేళ్ల పాటు సీఎంగా తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్‌వన్‌గా నిలిపి సుభిక్షమైన పాలన అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ మండల సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, బద్దం నర్సారెడ్డి, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్:పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్‌జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి,ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిలు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్, వైస్‌చైర్మన్ షేక్ మున్న, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఏబీ.చిన్నా,కాంగ్రెస్‌నాయకులు,బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో

పట్టణంలోని 15వార్డు రాంనగర్‌కాలనీలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ గంగామోహన్‌చక్రు, విశ్వబ్రహ్మణ సంఘం సభ్యులు హన్మాండ్లు, నర్సింలు, శేషాద్రి, సుదర్శన్, జిమ్మిరవి, అనిల్, రాజు, శివలింగం, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్:మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలంగాణ సిద్ధంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని లెక్చరర్‌లు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్‌పెద్దన్న జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన చేసిన కృషిని వివరించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జాతీయ సేవ పథకం ఆధ్వర్యంలో నిర్వహించారు. వైస్‌ప్రిన్సి పాల్ మర్రిపల్లి భూపతి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది రాజయ్య, రవీందర్, శ్రీలత, గంగారాం, బాజన్న, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మెండోర: తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర ఎంతో కీలకమైందని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి రమేష్ అన్నారు. మంగళవారం జయశంకర్ జయంతి సందర్భంగా మండలంలో జయశంకర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో సెక్రెటరీ రాజ్‌కుమార్; రేషన్‌డీలర్లు అశోక్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్:మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీకార్యాలయంలో ఏర్పాటు చేసిన జయశంకర్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేస్తామని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బబ్బురు ప్రతాప్‌రెడ్డి, మాజీఉపసర్పంచ్ పిట్ల సత్యం, మాజీఎంపీటీసీ మొండి మహేష్, నాయకులు మొండి అశోక్, సుంకరి రాము, దయాకర్, కార్తిక్, నరేష్‌రెడ్డి, చిన్నారెడ్డి, దత్తు, అశోక్, మహేష్, సంజయ్, క్రాంతి, గంగాధర్, సంతు, తదితరులు పాల్గొన్నారు.


జయశంకర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

రెంజల్: తెలంగాణ దార్శనికుడు సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆదర్శప్రాయుడని మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి వెంకటేష్ కొనియాడారు.ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ శ్రీనివాస్, ఏపీఓ రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● తెలంగాణ ఆత్మగౌరవ చరిత్ర సార్ జీవిత చరిత్ర : టీయూ రిజిస్ట్రార్

డిచ్‌పల్లి: తెలంగాణ విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రొ.జయశంకర్ సార్ జయంతి సందర్భంగా రిజిస్ట్రార్ యాదగిరి జయశంకర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు.ఈసందర్భంగా యాదగిరి మాట్లాడుతూ... నాలుగున్నర కోట్ల ఉద్యమ ఆకాంక్షను ప్రపంచానికి తెలియజేసిన మహనీయుడు ప్రొ.జయశంకర్ సార్ అని తెలంగాణ ఆత్మగౌరవ పోరాట చరిత్ర, సార్ జీవిత చరిత్ర అని పేర్కొన్నారు. ఉద్యమంతో ముడేసుకున్న జీవితం ఆయనదని విద్యాలయాలు, భవన నిర్మాణాల వల్ల నిలబడవని, బోధన వల్లే నిలబడుతాయని విశ్వసించిన వ్యక్తి జయశంకర్‌ది అన్నారు. మానవతమూర్తి అని ప్రశంసించారు.ప్రిన్సిపాల్ ఆరతి మాట్లాడుతూ...ఒక సాధారణ ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించి కాకతీయ వర్సిటీ వీసీగా ఎదగడం ఆదర్శ ప్రాయమన్నారు. ప్రొ.రవీందర్ మాట్లాడుతూ.. సామాన్య కార్యకర్తగా కొనసాగిన వ్యక్తి తెలంగాణరాష్ట్ర సాధన ఉద్యమానికి దిక్సూచిగా మారడన్నారు. ఈకార్యక్రమంలో టీచర్ అసోసియేషన్ అధ్యక్షుడు పున్నయ్య, అరుణ, సత్యనారయణ, ఉమారాణి, డా.నాగరాజు, ఖురేషి, రమణచారి, లక్ష్మణచక్రవర్తి, అకాడమీక్ కన్సల్టెంట్ లు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: తెలంగాణ మార్గనిర్దేశకుడు, ప్రొ.జయశంకర్ జయంతి సందర్భంగా మంగళవారం నడిపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసినివాళ్లు అర్పించారు.

వర్ని: చందూర్ మండల కేంద్రంలో మంగళవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ 90వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ ప్యారం అశోక్, కర్లం సాయిరెడ్డి, తూర్పు కృష్ణారెడ్డి, వడ్ల దత్తు, వెంకట్ రెడ్డి, అరికెల సాయిరెడ్డి, నరెడ్ల నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల అభివృద్ధి అధికారి శంకర్ నాయక్ ఆధ్వర్యంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ 90వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీవో శ్రీవాణీ, జూనియర్ అసిస్టెంట్ అభిషేక్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముప్కాల్: ముప్కాల్, బాల్కొండ మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ కోసం చేసిన సేవలను విద్యార్థులకు అధికారులు వివరించారు.

కోటగిరి: పొతంగల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన తెలంగాణ ఉద్యమంలో చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నవీపేట: తెలంగాణ సిద్దాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక దర్యాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జన వికాస్ సేవ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జన వికాస్ సేవ సంస్థ జిల్లా అధ్యక్షుడు తెడ్డు పోశెట్టి, నరేష్,తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు: ప్రత్యేక రాష్ట్రం కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా మంగళవారం రుద్రూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారి నిర్మల ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో, ఏపీవో, తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లకోసారి వేతన చట్టాన్ని సవరించాలి

● ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ


నందిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న బీడీ కార్మికులు

నందిపేట,ఆగస్టు 6:కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఐదు సంవత్సరాలకు ఒకసారి కనీసవేతన చట్టాన్ని సవరించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం నందిపేట మండల కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బీడీకార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. బీడీ కార్మికులు పొందుతున్న జీవనభృతి, చేయూత పథకం కింద రూ.2016ను రూ.4016కు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని రాజానగర్ దుబ్బా ప్రాంతంలో ఉన్న టెలిఫోన్ బీడీ కంపెనీ నుంచి మండల తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఆనంద్ కుమార్‌కు అందజేశారు. ఈసందర్భంగా అక్కడే సమావేశమైన రాష్ట్ర అధ్యక్షుడు వనమాలకృష్ణ మాట్లాడుతూ బీడీకార్మికులకు 8 నుంచి 12రోజులు మాత్రమే పని దొరకడం వలన కుటుంబ పోషణ భారమైందని తెలిపారు. కార్మికులకు వెయ్యిబీడీలకు రూ.249 రావాల్సి ఉండగా రూ.160 మాత్రమే అందుతుందని వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి వేతన చట్టాన్ని సవరించి బీడీ కార్మికులను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజే శ్వర్, మండల కార్యదర్శి సాయరెడ్డి, ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు గంగాధర్, మండలంలోని కుర్నా, శివాజీ, టెలిఫోన్, దేశాయి బీడీ కంపెనీల కార్మికులు తదితరులు ఉన్నారు.

నల్లగుట్టతండాలో బావిలో పడి ఒకరి మృతి

జక్రాన్‌పల్లి, ఆగస్టు6: మండలంలోని నల్లగుటతండా గ్రామానికి చెందిన మూడు దినేష్(25) నీటిబావిలో పడిమృతి చెందినట్లు ఎస్సైతిరుపతి తెలిపారు. ఎస్సైతెలిపిన వివరాల ప్రకారం నల్లగుట్ట గ్రామానికి చెందిన మూడు దినేష్‌చిన్నప్పటి నుంచి అంగవైకల్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దినేష్ ఆచూకీ కోసం గాలిస్తుండగా మంగళవారం మధ్యాహ్నం గ్రామశివారులోని తన కుటుంబానికి చెందిన వ్యవసాయ భూమి దగ్గరలోని నీటిబావిలో పడిచనిపోగా మృత దేహం కనిపించిందని ఎస్సై తెలిపారు. మృతుడు ఇంటి నుంచి బావి వద్దకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు నీటిబావిలో పడి పోవడంతో ఈత రాక చనిపోయాడని మృతుని అన్న ముడుగణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.మృత దేహాన్ని పోస్టుమార్టంనిమిత్తం ఆర్మూర్‌ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై తెలిపారు.

తృటిలో తప్పిన బస్సు ప్రమాదం


ధ్వంసం అయిన బస్సు ఇదే

మోస్రా,ఆగస్టు6: మండల కేంద్ర శివారులో అలీసాగర్ చౌరస్తా వద్ద తృటిలో బస్సు ప్రమాదం తప్పింది. ఉమ్మడి వర్ని మండల ఎస్సై కృష్ణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి మోస్రా వైపు వస్తున్న లారీ వెనకే వస్తున్న ఆర్టీసీ బస్ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్ ముందు అద్దం పగలగా ఎవరికి ఏం గాయాలు కాలేదు. అయితే బస్, లారీ యజమానులను, డ్రైవర్లను ఎస్సై పోలీస్ స్టేషన్‌కు పిలిచి డ్రైవర్లను మందలించి వదిలేశారు. మళ్లీ ఇలాంటి ప్రమాదాలు జరగకుండా డ్రైవింగ్ చేయాలని సూచనలు ఇచ్చి పంపించారు.

తల్లిపాలు ఎంతో శ్రేయస్కరం

డిచ్‌పల్లి,ఆగస్టు 6: పుట్టిన బిడ్డ నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలని ఎలాంటి ఆహారం ఇవ్వకూడదని జిల్లా ఉమెన్ వెల్ఫేర్ ఆఫీసర్ రసూల్‌బీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్ఎల్‌జీ మండపంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా 14మండలాలకు చెందిన అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, ఆశావర్కర్‌లను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. శిశువును తల్లి పాలు మాత్రమే తాగించాలని నీళ్ల, తేనే, గ్లూగోజ్, జంతువుల పాలు ఇవ్వవద్దని విరేచనలు అయ్యే ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్ మాట్లాడుతూ.. శిశువుకు తల్లి పాలు ఇవ్వడంతో ఎంతో లాభాలు ఉన్నాయని, తల్లి పట్ల ప్రేమ ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో స్వర్ణలత, లేబర్ ఆఫీసర్ యోహాన్, ఎంపీడీవో రాజేందర్, ఆరోగ్య పర్యవేక్షకురాలు దేవపాలమాత ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గద్దర్ ప్రథమ వర్ధంతి

నందిపేట, ఆగస్టు 6: నందిపేట మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజాగాయకుడు, కవిగద్దర్ (గద్దరన్న) ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పిం చారు. ఈ సందర్భంగా వక్తలు మా ట్లాడుతూ ప్రజల కోసం ఉద్యమాలను నడిపి, పోలీసు తూటాలకు కూడా బ యపడని వ్యక్తి గద్దరన్న అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కె గంగాధర్, ఎం దేవన్న, భైన మల్లయ్య, సతీష్, తదితరులు ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం


పచ్చలనడ్కుడలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

వేల్పూర్, ఆగస్టు6: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామం ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను మంగళవారం ప్రధానోపాధ్యాయుడు జె.రమేష్ ఆధ్వర్యంలో శాలువతో ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన ఉషారాణి, గణేష్, రవీందర్, ప్రభాకర్, గంగారెడ్డి, ప్రవీన్‌లను సన్మానించారు.ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్, మాజీ సర్పంచ్ శ్వేత గంగారెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శికి సన్మానం

వేల్పూర్, ఆగస్టు6: వేల్పూర్ మండలంలో జరిగిన పీఆర్‌టీయూ ఎన్నికల్లో మండల ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన మోతె గ్రామ ప్రభుత్వ పాఠశాల ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు సివి.నర్సింహరావును సన్మానించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల తరఫున నర్సింహరావును శాలువ, మెమోంటోతో సన్మానించారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వైద్యగణేష్, పీఆర్‌టీయూ నాయకులు మంచిర్యాల సురేష్, ఉపాధ్యాయులు మహేందర్, రత్నయ్య, కవిత, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద తొలగించాలని వినతి

ఎడపల్లి, ఆగస్టు6: పోచారంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని వాటి నుండి గ్రామస్థులు గాయాలు కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల పశువైద్యాధికారి ప్రమోద్ కుమార్‌కు మంగళవారం పోచారం గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. గ్రామం చుట్టూ గుట్టలు ఉండడంతో వేరే గ్రామాలనుండి పట్టుకు వచ్చిన కుక్కలను గుట్టలలో విడిచి పెట్టడంతో గ్రామంలో గతవారం రోజుల నుంచి వీధి కుక్కలు అధికమయ్యాయని, అవి దాడి చేయడం వల్ల గ్రామంలో చాలా మందికి గాయాలు అయ్యాయని వీధి కుక్కల బారి నుంచి గ్రామస్థులను కాపాడాలని మండల పశు వైద్యాధికారిని కోరుతూ వినతి పత్రం అందజేశారు. వీరిలో గ్రామస్థులు అశోక్, ఇస్తారి, రవి కుమార్, ముత్తన్న, కట్ట సుధాకర్, కట్ట సాయిలు, తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం

వర్ని,ఆగస్టు6: వర్ని మండలంలో మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్ స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్ ఏరియా, కోటయ్య క్యాంపులో పల్లె ప్రకఅతి వనం, నర్సరీలను పరిశీలించారు. చెత్తాచెదారం లేకుండా చూడాలని, నీటి నిల్వలు తొలగించాలని అధికారులకు సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీవో మారుతి, తహసీల్దార్ సాయిలు, ప్రతప్యేక అధికారి రవీందర్, గ్రామ కార్యదర్శి సాయిలు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో మంగళవారం స్వచ్ఛదనం, పచ్ఛదనం చురుకుగా కొనసాగింది. మండలంలోని కొత్తపల్లి, హెగ్డోలి, పొతంగల్, కోటగిరి గ్రామాలలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. నీటిట్యాంకులను క్లోరినేషన్ చేయించారు. కొత్తపల్లి గ్రామంలో పల్లె దవాఖానాను పరిశీలించారు. ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన కల్పించారు. చెరువు కట్టల బలోపేతం కొరకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మనోహర్ రెడ్డి, తహసీల్దార్ గంగాధర్, ఎంపీవో, ఏపీవో తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు జరుపుతున్న స్వచ్ఛదనం పచ్ఛదనం కార్యక్రమాన్ని ప్రతీఒక్కరు తమ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయగౌడ్ అన్నారు. మంగళవారం మండంలోని ఉప్లూర్ గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అందరితో కలిసి శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో పారిశుద్యం, తాగునీటి వనరులవద్ద పరిశుభ్రతతో పాటు తాగునీటిలో కలిపిన క్లోరినేషన్ శాతాన్ని పరిశీలించారు, పిచ్చిమొక్కల తొలగింపు కార్యమాలను ఆయన పరిశీలించారు.స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మొక్కలు నాటారు. అక్కడ పారిశుద్యాన్ని పరిశీలించారు.బతుకమ్మ కుంట వద్ద స్థలాన్ని పరిశీలించి మొక్కలునాలని ఆదేశించారు.ఈ కార్యక్ర మంలో ఎంపీడీవో రాజా శ్రీనివాస్, తహసీల్దార్ అంజనేయులు,ఏపీఎం కుంటగంగారెడ్డి, ఎంపీవో సదాశివ్, ఏపీవో విద్యానంద్ కార్యదర్శులు నరేందర్, శాంతికుమార్, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ టీచర్లు. అశావర్కర్‌లు,గ్రామస్థాయి అధికారులు ఈజీఎస్,ఐకేపి సిబ్బంది, మహిళాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.


వర్నిలో స్వచ్ఛదనం, పచ్చదనంను తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్

ఏర్గట్ల: మండలంలో జరుగుతున్న స్వచ్ఛదనం పచ్చదనం పనులను మంగళవారం జిల్లాడీఆర్‌డీవో సాయిగౌడ్ పరిశీలించారు. ఈ సంద ర్భంగా గుమ్మిర్యాల్ గ్రామంలో మొక్కను నాటారు. పలు పాఠశాలలు సం దర్శించి వాటర్ ట్యాంక్‌లు, ఏర్గట్లలో నర్సరీ, మండల సమాఖ్యకు సంబం ధించి కుట్టుమిషన్, విద్యార్థుల ఏకరూప దుస్తువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శివరామకృష్ణ, తహసీల్దార్ శ్రీలత, ఎంపిడీవో వెంకటేశ్వర్లు, ఏపీఎమ్ శ్యామ్, ఎంపీవో శివచరణ్, కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, రామకృష్ణ, కారోబార్, ఆశావర్కర్‌లు, అంగ్‌వాడీలు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా బోధన్ మండలంలోని మినార్‌పల్లి, భవానీపేట్ గ్రామాలను మంగళవారం డీపీవో, బోదన్ మండల ప్రత్యేక అధికారి తరుణ్ కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిసరాల ప్రాంతాలను, గ్రామాల్లోని వార్డులను పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం, పచ్ఛదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. స్వచ్ఛదనం, పచ్ఛదనంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో మధుకర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛదనం- పచ్ఛదానం కార్యక్రమం కొనసాగుతుంది. మంగళవారం గ్రామాలలో మండల, గ్రామ స్థాయి అధికారులు పాల్గొని వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆయా గ్రామాలలో అధికారులు మొక్కలు నాటుతున్నారు. రోడ్ల వెంట ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి శ్రమదానం చేస్తున్నారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇంటింటికి వెళ్ళి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో ఈనెల 9వ తేదీ వరకు స్వచ్ఛదనం - పచ్ఛదనంలో భాగంగా రోజువారి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్; ఎంపీడీవో సతీష్‌కుమార్, తహసీల్దార్ కిరణ్మాయి, ఎంపీవో యుసుఫ్‌ఖాన్, గ్రామప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముప్కాల్:నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని బాల్కొండ తహసీల్దార్ శ్రీధర్ అన్నారు. మంగళవారం బాల్కొండ మండలం కిసాన్‌నగర్ గ్రామంలో స్వచ్ఛదనం - పచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా పల్లె ప్రకృతి వనాన్ని ఆయన సందర్శించారు. ప్రకృతి వనంలో ఉన్న చెత్తచెదారాన్ని తొలగించి శుభ్రం చేయాలని అధికారులకు ఆదేశించారు. పెరిగిన చెట్ల కొమ్మలను కత్తిరించి పిచ్చిమొక్కలను తొలగించాలని సూచించారు. అలాగే బాల్కొండ మండలంలోని ఇత్వార్‌పేట్, జలాల్‌పూర్, నాగాపూర్, బస్సాపూర్ గ్రామాలలో ఎంపీడీవోవిజయభాస్కర్‌రెడ్డి పర్యటించి పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛదానం - పచ్ఛదానం కార్యక్రమం నిర్వహించారు. అలా గే ముప్కాల్ మండలంలోని ఆయా గ్రామాల్లో స్వచ్ఛదానం- పచ్ఛ దానం కార్యక్రమం భాగంగా తాగునీరు, వర్షం నీటి సంరక్షణ పై చేపట్టే కార్యక్రమాలపై స్పెషల్ ఆఫీసర్,ఎంపీడీవో అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయాగ్రామాల కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వర్ని: స్వచ్ఛదనం, పచ్చదనం రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా చందూర్ మండలం ఘన్‌పూర్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో పారిశుధ్యం పనులు బాగున్నాయని గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మధురిమ, సీనియర్ సహాయకులు రాజబాబు, గ్రామ పంచాయతీ కార్యదర్శి వనజ లత, పంచాయతీ సిబ్బంది, ఐకేపీ సీప, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్‌లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ముప్కాల్, ఆగస్టు6: పోస్టాఫీస్‌లో పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎఎస్పీ శ్రావన్‌కుమార్ అన్నారు. మంగళవారం ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామంలో తపాలశాఖ ఆధ్వర్యంలో గ్రామస్థులకు పథకాలపై అవగాహన కల్పించారు. పోస్టాఫీస్‌ను ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పోస్టాఫీస్‌లోని పథకాలను ప్రజలకు వివరించారు. 10ఏళ్ల దాటిన ప్రతీఒక్కరు రూ.500లతో ఖాతాలను ప్రారంభించవచ్చని, ఖాతా ద్వారా వచ్చే చెక్కును, ఏటీఎంను, నిఫ్ట్ సౌకర్యాలు ఉచితంగా పొందవచ్చని వివరించారు. రికరింగ్ డిపాజిట్, చిన్నపొదుపు పెద్ద రాబడి అందిస్తుందని, ప్రతీనెల ఆర్‌డీ సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా, అకౌంట్ బుక్ ద్వారా జీవిత బీమా పొందవచ్చని, వివిధ బీమా పథకాలు తపాల ద్వారా అందజేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శైవశ్రీనివాస్, కార్యదర్శి రాజ్యలక్ష్మీ, దశరథ్, బీపీఎం తదితరులు పాల్గొన్నారు.

రూ.3లక్షల వ్యయంతో రోడ్డు మరమ్మతులు



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమైన దృశ్యం

వర్ని,ఆగస్టు6: ఈ నెల 4న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన ప్రమాదాలకు అడ్డాగా వర్ని-కోటగిరి రహదారి కథనంపై కాంగ్రెస్ నాయకులు మంగళవారం స్పందించారు. డీసీసీ డెలిగేట్ వై.శ్రీనివాస్ రావు స్వయంగా స్పందించి రోడ్డు మరమ్మతుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. వర్ని మండల కేంద్రం నుంచి తగిలేపల్లి, అంబం(ఆర్)గ్రామం మీదుగా కోటగిరి మండల కేంద్రంకు వెళ్లే రహదారిపై గల బురద గుంతలను చదును చేయించి సుమారు రూ.3లక్షల వ్యయంతో కంకర చిప్స్ వేయించి ప్రజల రాకపోకలకు అటంకం కలుగకుండా చర్యలు చేపట్టారు. అధ్వాన్నంగా మారిన రోడ్డుతో తరుచూ ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారని, అనేక మంది కాళ్లు, చేతులు విరిగి ఆసుపత్రుల పాలయ్యారని ప్రయాణికులు గుర్తు చేశారు. 'ఆంధ్రజ్యోతి' కథనంతో యలమంచిలి శ్రీనివాస్ రావు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టి మానవతా దృక్పదంను చాటుకున్నారని ఆయా మండల కేంద్రాలు, గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఏసీపీ బస్వారెడ్డికి ఘన సన్మానం


ఏసీపీ బస్వారెడ్డిని సన్మానిస్తున్న జీజీ ఫౌండేషన్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు6: పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏసీపీ బస్వారెడ్డిని పట్టు శాలువతో ఘనంగా సన్మానించారు. ఇటీవల అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందిన సందర్భంగా బస్వారెడ్డిని శాలువతో సత్కరించి మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో జీజీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నివేదన్ గుజరాతీ, డిజె. దయానంద్, ప్రవీన్‌పవార్, జెస్సు ఆనంద్, వేణు, బెల్దారి శ్రీనివాస్, రాజేశ్వర్, డిజె.సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మ సంఘం నుంచి ఐదుగురి శాశ్వత సభ్యత్వం రద్దు

డిచ్‌పల్లి,ఆగస్టు 6: మండలంలోని బర్ధిపూర్ శివారులో గల కమ్మ సంఘంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మెజార్టీ సభ్యులు తీసుకున్న నిర్ణయాలను తీర్మానం చేయడం జరిగిందని జిల్లా అధ్యక్షురాలు అప్పనేని లక్ష్మీ ఓ ప్రకటనలో తెలిపారు. గత పాలక వర్గం, ప్రస్తుత పాలకవర్గంలో ఉండి ఆర్థికంగా సంఘానికి అన్యాయం చేసిన ఐదుగురు సభ్యులను శాశ్వతంగా తొలగించామని తీర్మానం చేశామన్నారు. ఇందులో పూర్వకమిటీ అధ్యక్షుడు కలగర శ్రీనివాసరావు, పూర్వ కమిటీ కార్యదర్శి మండవ రామకృష్ణ, కోశాధికారి కావూరి కృష్ణరావు, ప్రస్తుత కమిటీ ఉపాధ్యక్షులు కలగర వెంకటేశ్వర రావు, ప్రస్తుత కమిటీ సంయుక్త కార్యదర్శి వెనిగల సురేశ్‌లు ఉన్నారని తెలిపారు. వీరి ప్రాథమిక సభ్యత్వాన్ని శాశ్వతంగా రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే కోశాధికారి ముప్పనేని అప్పరావు సమర్పించిన 3ఏళ్ల ఆర్థిక లావాదేవీలను ఏకగ్రీవంగా ఆమోదించామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన

కోటగిరి,ఆగస్టు6: కోటగిరి, పొతంగల్ మండలాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమలత, మణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యం పెంపొందించాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి


నవీపేటలో విద్యార్థులతో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవీపేట,ఆగస్టు6: విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యం పెంపొందించాల్సిన అవసరం ఎంతైన ఉందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలనే ఉద్దేశంతో గత 11సంవత్సరాల క్రితం తమ ప్రభుత్వ హయంలో నవీపేటలో పాలిటెక్నిక్ కళాశాలను నిర్మించామని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వృత్తి విద్యను అభ్యసిస్తే రాబోయే రోజులలో వారికి మంచి భవిష్యత్ ఉంటుందని అన్నారు. తమ ప్రభుత్వం సాంకేతిక విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. కళాశాలలో మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేస్తామని అన్నారు. విద్యార్థులు బాగా చదివి మంచి ప్రయోజకులు కావాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతి తరగతికి వెళ్లి విద్యార్థులతో స్వయంగా మాట్లాడారు. ప్రస్తుతం నవీపేట కళాశాలలో 50శాతం మాత్రమే సీట్లు భర్తీ అయ్యాయని, మిగిలిన సీట్లను సైతం భర్తీ చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ తదితరులు పాల్గొన్నారు.

● కాలువపై వంతెన నిర్మించాలని వినతి

మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల సమీపంలో అలీసాగర్ కాలువపై వంతెన నిర్మించాలని పలువురు స్థానికులు, మోడల్ పాఠశాల విద్యార్థులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కోరారు. నవీపేట పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే తిరిగి నిజామాబాద్ వెళ్తుండగా పలువురు స్థానికులు ఎమ్మెల్యేను కలిశారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు6: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్‌లు కేటాయించిన అధికారులపై చర్యలు తీసు కోవాలని వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ స్థలాలను అప్పటి అధికార పార్టీ నాయకులు యాదేచ్ఛగా కబ్జాలు చేసి వాటిని నకిలీ పత్రాలు సృష్టించి ఇంటి నెంబర్‌లు కేటాయించారని, మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇంటి నెంబర్‌లు కేటాయించిన అధికారులపై తక్షణమే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి ఆరేపల్లి సాయిలు, నాయకులు నర్సయ్య, నవాబ్, శ్రీకాంత్, నరేష్, శీను, మంగ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇవ్వాలి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

పెద్దబజార్, ఆగస్టు 6: కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇవ్వాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆడబిడ్డ పెళ్లి భారం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం కింద లక్షా 116 రూపాయలు అందించడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం హామీ వెంటనే అమలు చేయాలని మా ఆడబిడ్డలు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 6 శాతం కస్టం డ్యూటీ తగ్గించడం కారణంగా బంగారం ధరలు కూడా తగ్గాయని అన్నారు. అనంతరం సౌత్, నార్త్ జోన్‌లకు చెందిన 388 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ దండు నీతూకిరణ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డును పొందిన రివర్స్ గేర్ నవీన్



అవార్డు అందుకుంటున్న నవీన్

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 6: సంగీత సాహిత్య నృత్య సేవా కళా సమ్మేళనం రాష్ట్రస్థాయి పురస్కారాన్ని జిల్లాకు చెందిన రివర్స్‌గేర్ నవీన్ అందుకున్నారు. నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బిగ్‌బాస్-2 నటీమణి సంజన చౌదరి చేతుల మీదుగా ఈ అవార్డును నవీన్ అందుకున్నాడు. అందరూ పాటలు పాడితే నవీన్ రివర్స్‌లో పాటలు పాడుతూ అందరిని ఆకట్టుకుంటున్నాడు. ఇప్పటికే మూడుసార్లు జాతీయస్థాయి అవార్డులు, 80కి పైగా రాష్ట్రస్థాయి అవార్డులను గెలుచుకున్నాడు. కార్యక్రమంలో రవిశ్రీ పాల్గొన్నారు.

రైతులకు కావాల్సిన విత్తనాలు సరఫరా

● టీఎస్‌సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న చైర్మన్ అన్వేష్‌రెడ్డి

నిజామాబాద్ రూరల్, ఆగస్టు 6: తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ రైతులకు కావాల్సిన నాణ్యమైన విత్తనాలు సరఫరా చేస్తోందని, రైతులు వాటిని కొనుగోలుచేయాలని సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎస్ సీడ్స్ కార్పొరేషన్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సంస్థ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు ఆర్మూర్‌లోఉన్న విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని సందర్శించారు. రైతులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రొడక్షన్ మేనేజర్ సంధ్యారాణి, ఇంజినీరింగ్ విభాగం మేనేజర్ నరసింహారెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ వినయ్, ఆర్ఎం విష్ణువర్ధన్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ విగ్రహాన్ని పార్లమెంట్ ఆవరణలో పెట్టాలి

● లోక్‌సభలో ఎంపీ ధర్మపురి అర్వింద్

పెద్దబజార్, ఆగస్టు 6: తన జీవితాన్ని బంజారాల అభ్యున్నతికి అంకితమిచ్చిన బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని పార్లమెంట్ ఆవరణలో ఏర్పాటు చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరారు. మంగళవారం ఆయన లోక్‌సభలో మాట్లాడారు. కర్నాటకకు చెందిన సేవాలాల్ మహరాజ్ బంజారాల ఆరాధ్య దైవంగా నిలిచారని అలాంటి మహనీయుడిని యావత్ జాతి స్మరించుకోవాలని అన్నారు.

పీఆర్‌టీయూ మండల కమిటీ ఎన్నిక

ఇందల్వాయి, ఆగస్టు 6: పీఆర్‌టీయూ ఇందల్వాయి మండల శాఖ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షునిగా గన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న భార్గవ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులు ఏ.విజయరాం, మహిళా ఉపాధ్యాయురాలు శ్యామల, కార్యదర్శి వంశీకృష్ణ, మహిళా కార్యదర్శి స్రవంతిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.



జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి



జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో అనంత్‌రావు

ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి

సుభాష్‌నగర్, ఆగస్టు 6: జిల్లా వ్యాప్తంగా తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని కంఠేశ్వర్ చౌరస్తా వద్ద వివిధ సంఘాలు, పార్టీల నాయకులు, ఉద్యోగ సంఘాలు జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జయశంకర్ పాత్రను కీర్తిస్తూ పొగిడారు. నగరంలోని కంఠేశ్వర్ చౌరస్తా వద్ద జయశంకర్ విగ్రహానికి నగర మేయర్ దండు నీతూకిరణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ వద్ద గల జయశంకర్ విగ్రహానికి టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు అలుక కిషన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతికుంట శేఖర్, సహ అధ్యక్షుడు చిట్టి నారాయణరెడ్డి, పోల శ్రీనివాస్, సతీష్, కిషన్, సుమన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాజిరెడ్డి గోవర్ధన్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, సుజిత్‌సింగ్ ఠాకూర్, ఎనుగందుల మురళి, శంకర్, సాదిఖ్, కృష్ణప్రసాద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిజామాబాద్ అర్బన్: జయశంకర్ జయంతి సందర్భంగా జిల్లా దివ్యాంగ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బట్టు శంకర్‌రాజు ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని కంఠేశ్వర్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ బావజాల వ్యాప్తి కోసం తన జీవితాన్నే అంకితం చేసి స్వరాష్ట్ర సాధనకు మార్గం సుగమం చేసిన తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా ఇంచార్జి బట్టు కృష్ణమూర్తి, జయసాగర్, రామ్‌లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దబజార్: నగరంలోని కంఠేశ్వర్ చౌరస్తాలోగల జయశంకర్ విగ్రహానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జయశంకర్ జయంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ పూలమాలలు వేసి నివాళలర్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ హెచ్‌వోడిలు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమోహన్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు కిశోర్‌కుమార్, ఏడి సుదర్శన్‌కుమార్, సూపరింటెండెంట్ పెద్దోళ్ల నాగరాజు, గంగాధర్, వైద్యులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఖిల్లా: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రొఫెసర్ జయశంకర్ ఎనలేని కృషి చేశారని ఆయన కృషివల్లే తెలంగాణ ఏర్పాటు జరిగిందని ఆయన చేసిన కృషి అభినందనీయమని అదనపు డీసీపీ అడ్మిన్ బి.కోటేశ్వర్‌రావు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను మంగళవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్ ఏఆర్ శంకర్‌నాయక్, ఏవో శ్రీనివాస్, శంకర్, బషీర్, రిజర్వు ఇన్‌స్పెక్టర్, పోలీస్ కార్యాలయ సిబ్బంది, సిసిఆర్ సిబ్బంది, ఐటికోర్ సిబ్బంది, పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, సెంట్రల్ కాంప్లైట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని కంఠేశ్వర్ వద్ద గల జయశంకర్ విగ్రహానికి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిజామాబాద్ లీగల్: ప్రొఫెసర్ జయశంకర్ లెక్చరర్‌గా 1968లో పునర్జీవన ఆందోళనలో పాల్గొని తెలంగాణకు అసలైన తెలంగాణ సిద్ధాంతకర్తగా నిలిచాడు. ఇడ్లీ సాంబార్ గో బ్యాక్ అనే ఉద్యమంతో రాష్ట్ర హోదాను పెంచిన ఉద్యమకారుడని తెలంగాణ కోసం ఉద్యమ ప్రయత్నాల్లో సంబంధం కలిగి ఉన్నారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాజు, కార్యదర్శి వసంత్‌రావు, న్యాయవాదులు మధుసూదన్‌రావు, రాజ్‌కుమార్ సుబేదార్, ఆశనారాయణ, విఘ్నేష్, తుకారాం, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆచార్య జయశంకర్ జయంతిని ఎంపీడీవో అనంత్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జయశంకర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎంపీవో రాజ్‌కాంత్, ఏపీవో పోశెట్టి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది విమల, లింగన్న, తదితరులు ఉన్నారు.

సిరికొండ : మండలంలో అధికారులు, ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. భారత్ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రూరల్ నియోజకవర్గం కన్వీనర్ మల్లెల సాయిచరణ్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

అలీసాగర్ పైప్ లీకేజీ పరిశీలన

సుభాష్‌నగర్, ఆగస్టు 6: నగరంలోని అలీసాగర్ మెయిన్ పైప్‌లైన్ లీకేజీని నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ పరిశీలించారు. మంగళవారం అలీసాగర్ మెయిన్ పైప్ లీకేజీ వద్దకు వెళ్లి లీకేజీ జరుగుతున్న తీరును పరిశీలించారు. లీకేజీ మూయడానికి కావాల్సిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పైప్‌లైన్ లీకేజీతో రెండు రోజుల పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని వాటర్ ట్యాంకుల ద్వారా నీటిసరఫరా చేయనున్నట్లు తెలిపారు. బుధవారం, గురువారం పలు ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదన్నారు. 7వ తేదీన లతీఫ్‌కాలనీ, డైరీఫాం ఏరియా, లాల్‌బాగ్, ఆనంద్‌నగర్, న్యాల్‌కల్‌రోడ్ ఏరియా, నాగారం, ఒడ్డెరకాలనీ, గంగాస్థాన్, పంచాయతీనగర్ కాలనీ, ఆటోనగర్, మాలపల్లి, దయానంద్‌నగర్, బ్రహ్మపురి హిల్స్, మిర్చికంపౌండ్, శాంతినగర్, నిజాంకాలనీ, 300 క్వాటర్స్, వెంగల్‌రావునగర్, స్లాటర్‌హౌజ్, మహాలక్ష్మీనగర్, వినాయక్‌నగర్ ఏరియాల్లో నీటి సరఫరా ఉండదని తెలిపారు. 8వ తేదీన సుభాష్‌నగర్, నాందేవ్‌వాడ, గౌతంనగర్, గోల్‌హనుమాన్, కోటగల్లి, బడాబజార్, కంఠేశ్వర్, తిలక్‌గార్డెన్, ఎల్లమ్మగుట్ట, పోలీస్‌లైన్, ప్రగతినగర్, ఆటోనగర్, మిర్చికంపౌండ్, మాలపల్లి, వినాయక్‌నగర్ ఏరియాల్లో నీటిసరఫరా ఉండదని ప్రజలు సహకరించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ధర్పల్లి, ఆగస్టు 6: వైరల్ ఫివర్‌లపై అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండలంలోని రామడుగు, కేసారం, మైలారం, చల్లగరిగె, దుబ్బాక, రేకులపల్లి, ఎస్‌టి తాండా, ధమ్మన్నపేట్ గ్రామాల్లో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. కార్యక్రమంలో ఎంపిడివో బాలకృష్ణ, ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

ప్రభుత్వం వెంటనే జీవనభృతి చెల్లించాలి

ఇందల్వాయి, ఆగస్టు 6: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులకు 4వేల రూపాయల జీవనభృతి చెల్లించాలంటూ మండల కేంద్రంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి డిప్యూటి తహసీల్దార్ శైలజాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీడీవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ మాట్లాడుతూ బీడీ పరిశ్రమలో సుమారు 7లక్షల మంది పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని గతంలో నెలకు 26 రోజుల పని దొరికేదని ప్రస్తుతం 9 నుంచి 12 రోజుల పని మాత్రమే దొరకుతుందని అన్నారు. హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని, రేషన్‌కార్డు లేనివారికి నూతన రేషన్‌కార్డులు ఇవ్వాలని, ఇండ్లులేని నిరుపేదలకు ఇళ్లు కట్టుకోవడానికి 10లక్షలు ఇవ్వాలని, బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న వివిధ కేటగిరిలకు చెందిన ఉద్యోగులందరికి జీవనభృతి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న, యూనియన్ కోశాధికారి కిషన్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సాయాగౌడ్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు మురళి, మోహన్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల వరకు తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

● నగర మేయర్ నీతూకిరణ్

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 6: పుట్టిన గంట లోపు, ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టడం బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరమని మేయర్ నీతూకిరణ్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నగరంలోని గంగాస్థాన్‌లోగల వివేకానంద ధ్యానమందిరంలో జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. తల్లిపాల సంస్కృతిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పుట్టిన గంట లోపల తల్లిపాలు పట్టడం, ముర్రుపాల ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మేయర్, మాజీ ఎమ్మెల్సీ

కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి, జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారిని రసూల్‌బీల్, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, తదితరులు పాల్గొన్నారు.

ఏబీసీడీ వర్గీకరణకు నిరసనగా మాలమహానాడు ధర్నా

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 6: అంబేద్కర్‌ను అవమానిస్తూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఆరుగురు సభ్యుల కమిటీ ఏబీసీడీ వర్గీకరణ చేసుకోవచ్చని తీర్పు ఇవ్వడాన్ని మాలమహానాడు నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ గైనిగంగారాం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, బాల్‌రాజు, చంద్రశేఖర్, సునీల్‌కుమార్, దయాసాగర్, రాంచందర్‌గైక్వాడ్ తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతతో సీజనల్ వ్యాధులను అరికడదాం

పెద్దబజార్, ఆగస్టు 6: పరిసరాల పరిశుభ్రతో సీజనల్ వ్యాధులను అరికడదామని జిల్లా ఆరోగ్య విద్యాబోధకులు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు అ న్నారు. మంగళవారం నగరంలోని గౌతంనగర్‌లో పట్టణ ఆరోగ్య కేంద్రంలో గిరిరాజ్ కళాశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యంలో భాగంగా వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ ఆరోగ్యం, సామాజిక ఆరోగ్యం, ఆధ్యాత్మిక ఆరోగ్యం ప్రధానమైనవని అన్నారు. అదేవిధంగా సీజనల్ వ్యాధుల్లో ప్రధానంగా వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులపై దృష్టిసారించాలన్నారు. కీటక, జనిత వ్యాధులను నియంత్రణలో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడువాపు, పైలేరియా ముఖ్యమైనవని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రావు, అధ్యాపకులు దీపక్, శ్రీకాంత్, గోపాల్, ఆసుపత్రి సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన పోలీసులు

సిరికొండ, ఆగస్టు 6: సిరికొండ-ధర్పల్లి రోడ్డుపై ఏర్పడిన గుంతలను సిరికొండ పోలీసులు మంగళవారం పూడ్చారు. ఏఎస్సై బాల్‌సింగ్ తన సిబ్బందితో కలిసి ప్రమాదకరంగా ఉన్న గుంతల్లో మట్టి పోసి రోడ్డును బాగు చేశారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఖిల్లా, ఆగస్టు 6: నగరంలోని మూడో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో భారీ చోరి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి ఇంటిలో ఉన్న బీరువాను ధ్వంసం చేసి అందులోని రూ.8లక్షల నగదు, ఆరు తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. గిరిధర్‌నగర్ రోడ్ నంబరు-2, చంద్రశేఖర్ కాలనీ చౌరస్తాకు చెందిన భూమేష్ తాను ఉంటున్న ఇంట్లో ఫ్యాన్ తిరగకపోవడంతో కింది ఇంటికి తాళం వేసి పై అంతస్తులో తన కుటుంబసభ్యులతో నిద్రించారు. దీనిని గమనించిన గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి ఇంటిలోకి చొరబడ్డారు. బీరువాలో ఉన్న నగదు, బంగారాన్ని ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న మూడో టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి వివరాలను సేకరించారు. దుండగుల కోసం సీసీ కెమరాలను పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్ తెలిపారు.

చంపుతామని బెదిరించిన నలుగురిపై కేసు

ఖిల్లా, ఆగస్టు 6: తమ వద్ద నుంచి డబ్బులు తీసుకుని ఇవ్వకుండా చంపుతామని బెదిరించిన నలుగురిపై నగరంలోని మూడో టౌన్ పోలీసు స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఏలూరు జిల్లా పంగిడిగూడెం గ్రామానికి చెందిన రవిచంద్రారెడ్డి అనే వ్యక్తిని మోసం చేయడానికి యత్నించిన నగరానికి చెందిన వడ్డెన్న, శివ, ప్రవీణ్, ఎరుకల రాజ్‌కుమార్‌లపై జూలై 26న కేసునమోదు చేసినట్టు చెప్పారు. నగరానికి చెందిన ఎరుకల రాజ్‌కుమార్ బాధితుడు నివాసం ఉండే జంగారెడ్డిగూడెంకు వెళ్లి మీకు డబ్బులు అవసరమున్నాయని, మీకు ఎన్ని కోట్లు అయిన అప్పుగా రూపాయి వడ్డీకి ఇస్తామని నమ్మించి ఆయన వద్ద నుంచి ఆస్తి పత్రాలను తీసుకుని వాటిని పరిశీలించిన అనంతరం మీకు 5కోట్ల వరకు డబ్బులు అప్పుగా ఇస్తామని చెప్పినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. వారి మాటలను నమ్మిన సదరు వ్యక్తి నిజామాబాద్‌కు చేరుకుని వారు చెప్పిన ప్రకారం వారికి చెక్కులు, ప్రామీసరినోట్లు ఇచ్చి 54లక్షలు తీసుకుని వెళ్లాడు. మిగతా డబ్బు కోసం తిరిగి రావలని వారికి సమాచారం అందించగా మేము ఇచ్చిన డబ్బులు తీసుకుని రావాలని మేము పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వాలంటే మాకు నమ్మకం కలుగాలని చెప్పారు. దీంతో వారి మాటలను నమ్మిన సదరు వ్యక్తి వారు చెప్పిన ప్రకారం కోటి 28లక్షల రూపాయలను వారికి ఇచ్చి తనకు 5కోట్లు ఇవ్వాలని చెప్పగా వారు డబ్బులు ఇవ్వకపోగా బెదిరింపులకు పాల్పడ్డారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ. ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.105	రూ.225	రూ. 245

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,300	రూ.66,600	రూ.850

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : డెడ్‌పూల్ (ఇంగ్లీష్ 3డీ) (12.30, 7.15)
: కల్కి (3డీ తెలుగు) (3.30,10.15)
స్క్రీన్-2 : శివం భజే (11.05, 4.50, 7.35,10.20)
: బుడ్డీ (1.50)
స్క్రీన్-3 : అరోన్ (హిందీ) (12.40,7.00,10.10)
: అలనాటి రామచంద్రుడు (3.50)
స్క్రీన్-4 : రాయన్ (12.20,6.30)
: తిరగబడరా సామి (3.40)
: బుడ్డీ (10.00)



ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : బుడ్డీ (తెలుగు) (1.35, 7.30)
: అరోన్ (హిందీ) (4.30, 10.20)
స్క్రీన్-2 : కల్కి(తెలుగు) (10.25, 1.30, 10.30)
: రాయన్ (4.50, 7.40)
స్క్రీన్-3 : రాయన్ (1.20, 10.45)
: కల్కి(4.10, 7.30)

దేవి : రాయన్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్: తిరగబడరా సామి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి(11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్